క్లుప్తంగా

పరారైన నిందితుడి పట్టివేత

శృంగవరపుకోట: గతంలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడి, పోలీసుల నుంచి తప్పించుకు పోయిన నిందితుడిని ఎస్.కోట పోలీసులు బుధవారం పట్టుకున్నారు. 2023లో మే నెలలో పల్సర్‌బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల్ని పోలీసులు వెంబడించారు. వారిలో ఒక వ్యక్తి పట్టుబడగా, మరో వ్యక్తి బైక్‌పై పరార య్యాడు. దీంతో ఆ వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం లో నమ్మకమైన సమాచారంతో పందిరప్పన్న జంక్షన్ వద్ద మాటు వేసి పల్సర్ బైక్‌తో వచ్చిన వ్యక్తిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ ఎం.వి.నారాయణమూర్తి చెప్పారు.

అభినందన



రజత పతకం సాధించిన ఇందును అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ

చీపురుపల్లి: ఏలూరు జిల్లాలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పెదనడిపల్లి ఉన్నత పాఠశాల 9వతరగతి విద్యార్థిని కిల్లారి ఇందు రజత పతకం సాధించింది. విద్యార్థినిని బుధవారం ఆ పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, పీఈటీ ఎం.రామా రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

దాబాల్లో మద్యం తాగుతున్న 15 మంది అరెస్టు

బొండపల్లి: మండల పరిధిలోని మూడు దాబాల్లో నిబంధనలకు విరుద్ధంగా బహిరంగంగా మద్యం తాగుతున్న 15 మందిని అదుపులోనికి తీసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోడసింగిపేట గ్రామం పరిధిలో గల ఎస్.ఆర్ దాబా, పంజాబీ దాబాతో పాటు గొట్లాం బైపాస్ రోడ్డు సమీపంలో గల గ్రాండ్ ఫుడ్ కోర్టు దాబాలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగుతుండగా 15 మంది నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిపై ఓపెన్ డ్రింకింగ్ కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆర్థిక సహాయం



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న ఎస్ఎంఎస్ పరిశ్రమ హెడ్ గోపి, తదితరులు

మెరకముడిదాం: గర్భాం ఎస్ఎంఎస్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేసిన మండలంలోని భైరీపురం గ్రామానికి చెందిన తాడ్డి రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం, తోటి కార్మికులు కలిసి రూ.1,27,000 ఆర్థిక సహాయం చేశారు. నగదును మృతుడు భార్యకి పరిశ్రమ యూనిట్‌హెడ్ వాకాడ గోపి బుధవారం అందజేశారు. పరిశ్రమ ఉద్యోగులు పక్కి శ్రీనివాసరావు, ఉప్పు శ్రీనివాసరావు, శివకుమార్, సత్యనారాయణ, సరిధి రాంబాబు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శాంతి


శృంగవరపుకోట: స్థానిక కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు కరాటే పోటీల్లో సత్తా చాటి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ శాంతి మహంతి బుధవారం తెలిపారు. ఈనెల 10న విశాఖపట్నంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో విద్యార్థులు వి.సోహన్ బంగారు పతకం, వి.హార్దిక్ వినయ్, ఆర్.హర్షవర్ధన్, ఆర్.చైతన్య, జి.తపస్యశర్మ వెండిపతకాలు, రోహిత్‌నాయుడు, వి.ప్రీతమ్ కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. విద్యార్థులను, కోచ్ వి.శ్రీనివాసరావును స్కూల్‌లో సన్మానించారు.

ప్రీమియం చెల్లించేందుకు రేపటితో గడువుపూర్తి

చీపురుపల్లి: వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో భాగంగా జీడి పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తోందని, రైతులు ఈనెల 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని హెచ్ఓ సీహెచ్.చంద్రశేఖర్ చెప్పారు. మండలంలోని నిమ్మలవలస, పెదనడిపల్లి గ్రామాల్లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎకరా నికి రూ.1,500 ప్రీమియం చెల్లించాలని, పంటకు నష్టం వాటిల్లితే రూ.30 వేల వరకు బీమా వస్తుందన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాపుస్తకం, పంట సాగు నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో సమర్పించి, మీసేవ కేంద్రాల్లో కానీ, బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లలో కానీ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

* పర్యాటకులను ఆకట్టుకుంటున్న తాటిపూడి జలాశయం
* కాటేజీ ఆధునికీకరణతో మెరుగైన వసతులు
* వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న పర్యాటకులు

మురిపిస్తున్న తాటిపూడి అందాలు



తాటిపూడి జలాశయం

గంట్యాడ: జిల్లాలో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో గంట్యాడ మండలంలోని తాటిపూడి జలాశయం ఒకటి. మూడు వైపులా పచ్చని కొండల నడుమ నిండుకుండలా కనిపించే జలాశయం, దాని చుట్టూ ఉన్న తోటలు పర్యాటకులను ఆకర్షిస్తూ, ఇక్కడికి వచ్చేవారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కార్తీక మాసంలో ఈ ప్రాంతంలో పర్యాటకుల సందడి అధికంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకుల్లో కొందరు ఇక్కడి కాటేజీలో ఒకటి రెండు రోజులు బస చేస్తుంటారు. ఏసీ ,నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ కాజేజీలో 2019కు ముందు గదులు, వసతులు సరిగ్గా ఉండేవి కాదు. గదుల మరమ్మతులు, ఇతర వసతుల విషయం అప్పటి ప్రభుత్వం విస్మరించింది. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం కాటేజీని ఆధునికీకరించి, ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. పర్యాటకులను ఆకర్షించడం కోసం అందమైన పెయింటింగ్‌లు, విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అన్నిరకాల సదుపాయాలు ఉండడంతో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. కాటేజీలో విడిది చేసే వారి కోసం ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన మాంసాహార, శాఖాహార వంటకాలను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. తాటిపూడి చేపల కూర ఇక్కడ ప్రత్యేకత. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో సినిమా,షార్ట్ ఫిల్మ్‌ల షూటింగ్‌లు కూడా జరుగుతున్నాయి.





కాటేజీ ఆవరణలో ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్, ఆకృతులు



జలాశయం వద్ద పర్యాటకుల సందడి



పర్యాటకుల విడిది కోసం కాటేజీ



ఆహ్లాదకరంగా కాటేజీ ప్రాంగణం

పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది

కాటేజీ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. పర్యాటకులను ఆకర్షించేందుకు పెయింటింగ్స్, విగ్రహాలు ఏర్పాటు చేశాం. కాటేజీలో పర్యాటకులకు ఆంధ్రా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటకాలను అందిస్తున్నాం. కాటేజీకి వచ్చే రోడ్డు కూడా బాగు చేయించాం. ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య ఏటా పెరుగుతోంది.

– చుక్క శేషు, గిరివినాయక ఇకో టూరిజం మేనేజర్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వేపాడ: వాలీబాల్ పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థిని హేమశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్



జామి: కబడ్డీ పోటీలకు ఎంపికైన జామి హైస్కూల్ విద్యార్థి జగన్‌మోహన్‌ను అభినందిస్తున్న హెచ్ఎం రెహమాన్



గుర్ల: కబడ్డీ పోటీలకు ఎంపికైన వల్లాపురం హైస్కూల్ విద్యార్థి జగదీశ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు

జామి: అండర్–14 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు జామి హైస్కూల్ విద్యార్థి జగన్‌మోహన్, గుర్ల మండలంలోని వల్లాపురం హైస్కూల్ విద్యార్థి పీతల జగదీశ్ ఎంపికయ్యారని ఆ పాఠశాలల పీడీలు చంద్రశేఖర్, తిరుపతిరావు బుధవారం తెలిపారు. ఈనెల 9,10,11వ తేదీల్లో పశ్చి మ గోదావరి, బాపట్ల జిల్లాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభకనబరచడంతో జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని పీడీలు చెప్పా రు. విద్యార్థులను ఆ పాఠశాలల హెచ్ఎంలు రెహమాన్, అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని

వేపాడ: బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సింగంపల్లి హేమశ్రీ అండర్–19 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు బుధవారం తెలిపారు. ఈనెల 9,10,11 తేదీల్లో విజయవాడలో నిర్వ హించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చక్కని ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో చోటుదక్కించుకుందని చెప్పారు.విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు, పీఈటీ రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

హైందవ శంఖారావం సభకు తరలిరండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు ఏడుకొండలు

గజపతినగరం: విజయవాడలో 2025 జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం సభకు హైందవులంతా తరలి రావాలని విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల విశ్వహిందూ పరిషత్ ధర్మప్రచార, సమరసత సేవా ఫౌండేషన్ సంయోజక్ రాగాల బలరాం నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు ఏడుకొండలు పిలుపునిచ్చారు. శంఖారావం సభకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల సంరక్షణ, స్వయం ప్రతిపత్తి కోసం, దేవాలయాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ఆలయ కమిటీలను ఏర్పాటు చేసి వాటి కి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో లక్షలాది మందితో హైందవ శంఖారావం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు హైందవులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యంగా..



చీపురుపల్లిరూరల్(గరివిడి): శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ సరళ



కొత్తవలస: సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రమణయ్య



జామి: మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పలనాయుడు



గుర్ల: ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యాలను వివరిస్తున్న ఎంపీడీఓ శేషుబాబు



వేపాడ: మాట్లాడుతున్న తహసీల్దార్ రాములమ్మ



బొండపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

శతశాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా 'ఉల్లాస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జెడ్పీ సీఈఓ బి.సత్యనారాయణ, ఎంపీడీఓలు తెలిపారు. 'ఉల్లాస్' కార్య క్రమంపై రెండురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులు చీపురుపల్లి, గరివిడి, కొత్తవలస,జామి, గుర్ల, వేపాడ, బొండపల్లి మండల పరిషత్ కార్యాల యాల్లో ఎంపీడీఓల ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. వలంటీర్లగా ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల్లోని చదువుకున్న సభ్యులతో పాటు, వీఓఏలు, వెలుగు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అధికారులు మాట్లాడుతూ 2025 మార్చిలోగా గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ఒక్కో వలంటీర్ కనీసం పది మంది నిరక్షరాస్యులను ఎంపిక చేసుకుని వారికి ఖాళీ సమయాల్లో, రాత్రి వేళల్లో రాయడం, చదవడం నేర్పించా లని సూచించారు. ఈకార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. తహసీల్దార్‌లు, వెలుగు, ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. – చీపురుపల్లి/చీపురుపల్లిరూరల్ (గరివిడి)/కొత్తవలస/ జామి/గుర్ల/వేపాడ

సంక్షిప్తంగా...

నేడు వైద్య శిబిరం

చీపురుపల్లి: స్థానిక లయన్స్‌క్లబ్, లయన్స్ స్టార్స్ క్లబ్ నేతృత్వంలో పట్టణంలోని మూడు రోడ్ల జంక్షన్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహిం చనున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు గంట్యాడ విష్ణుమూర్తి, డి.సీతారామరాజులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే ఈశిబిరంలో సుగర్, బీపీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ డీలర్‌పై 6–ఏ కేసు

గంట్యాడ: రేషన్ బియ్యం, పంచదార స్టాకులో తేడా ఉండడంతో వసంత గ్రామ డీలర్ శిరికి రామలక్ష్మిపై 6–ఏ కేసు నమోదైంది. వసంత గ్రామంలోని రేషన్ డిపోలో, ఎండీ యూ వాహనంలో సీఎస్‌డీటీ మూర్తి బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డుల ప్రకారం డిపోలో ఉండాల్సిన స్టాక్ కంటే 850 కిలోల బియ్యం, 96 ప్యాకెట్ల పంచదార తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. డీలర్ 6–ఏ కేసు నమోదు చేశామని, ఎండీయూ వాహన ఆపరేటర్ బి.కనకారావుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శృంగవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ డి.శ్రీధర్ బుధవారం తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం, 16న గ్రంథాలయ ఉద్యమ నేతల సంస్మరణ, 17న కవిసమ్మేళనం, 18న విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, క్రీడల పోటీలు, 19న రంగవల్లులు, అల్లికల పోటీలు, 20న డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన, సామూహిక స్వీయ పఠనం కార్యక్రమాలు నిర్వహిస్తామని, పాఠకులు, పుస్తక ప్రియులు, సాహితీవేత్తలు, విద్యార్థులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

మెరకముడిదాం/ జామి: మెరకముడిదాం, జామి శాఖా గ్రంథాలయాల్లో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్‌లు బుచ్చింనాయుడు, ఎస్.సోమునాయుడు బుధవారం తెలిపారు. జామిలో సంబంధిత వాల్ పోస్టర్లను ఎంఈఓ జయశ్రీ ఆవిష్కరించారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు.పాఠకులు, విద్యార్థులు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నిల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు

జామి: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా జాగరం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో టీడీపీ నాయకులు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై ఆ గ్రామసర్పంచ్ వసి పార్వతి బుధవారం ఎంపీడీఓ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. టిడిపి నేతలు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రోడ్డు పనులు ప్రారంభించారని, తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పీడీఎస్ఓ సదస్సు రేపు

శృంగవరపుకోట: ఉత్తరాంధ్ర కరువు–వలసలు, విద్యా, ఉపాధి రంగ సమస్యలు, కర్తవ్యాలు అనే అంశంపై ఈనెల 15న విజయనగరంలో పీడీఎస్ఓ (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘ నాయకులు తెలిపారు. సంబంధిత వాల్‌పోస్టర్లను స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. పీడీఎస్ఓ కన్వీనర్ బి.రాజేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పుష్కలమైన జలవనరులు, భూములు ఉండి కూడా ఉపాధి కోసం రాష్ట్రాలు దాటి వలస పోతున్నారన్నారు. వ్యవసాయ ఆధారిత జూట్, సుగర్ మిల్లులు మూసేసి, ఇప్పుడు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసేందుకు పాలకులు సిద్ధమవుతున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్రను ఉత్తి ఆంధ్రాగా మార్చేస్తున్నారని, గంజాయి అడ్డాగా మారుస్తున్నారని, ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో విద్యారంగంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, వాటిని పట్టించుకోలేని స్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. ఈ సమస్యలపై పోరాటం సాగించేందుకు ఏర్పాటు చేస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సంఘం సభ్యులు బాలరాజు, మనోహర్, రవి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించం

* వీఓఏల తొలగింపుపై బాధితులు, గ్రామైక్య సంఘాల సభ్యుల నిరసన
* కారణం లేకుండా తొలగించడమేంటని అధికారులను నిలదీత
* ఎన్నిక నిర్వహిస్తామని చెప్పిన వెలుగు కార్యాలయ అధికారులు



వెలుగు ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: ఏళ్ల తరబడి పని చేస్తున్న వీఓఏలను ఎలాంటి కారణం లేకుండా, నోటీసులు కూడా ఇవ్వకుండా అధికారులు విధుల నుంచి తొలగిస్తున్నారని, అధికారులు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించమని గ్రామైక్య సంఘాల సభ్యులు, బాధితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని పత్తికాయవలస, కొత్త అగ్రహారం గ్రామాల్లోని వీఓఏలను తొలగించడాన్ని నిరసిస్తూ స్థానిక వెలుగు కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. వీఓఏలు తప్పు చేయకపోయినా ఎలా తొలగిస్తారంటూ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షు డు ఇప్పిలి అనంతం, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు వెలుగు అధికారులను నిలదీశారు. వీఓఏల తొలగింపుపై సరైన సమాధానం చెప్పేంత వరకు వెలుగు కార్యాలయం నుంచి కదిలేది లేదని భీష్మించారు. ఫిర్యాదులు లేకపోయినా ఎందుకు తొలగించాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పారని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగా అన్యాయంగా వీఓఏలను తొలగించం సమంజసం కాదన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎలా తొలగిస్తారన్నారు. సరైన కారణాలు లేకుండా వీఓఏలను తొలగించడానికి వీల్లేదని జిల్లా అధికారులు చెబుతున్నప్పటికీ మండల అధికా రులకు ఎందుకు అంత అత్యుత్సాహమని ప్రశ్నించా రు. వీఓఏల అక్రమ తొలగింపులపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు నిరసన కొన సాగడంతో పోలీసులు వెలుగు కార్యాలయానికి చేరుకున్నారు. ఏపీఎం ఎం.అప్ప లనాయుడు మాట్లాడుతూ ఈనెల 25న గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాల మేరకు వీఓఏలను నియమిస్తామని చెప్పడంతో నిరసన విరమించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పతివాడ రాజారావు, గిరడ రాందాసు, కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్, యల్లంటి శివ, కర్రోతు ప్రసాద్, చందక గురునాయుడు పాల్గొన్నారు.

బొత్స కుటుంబాన్ని విమర్శించే స్థాయి మీకు లేదు



గజపతినగరంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ తవుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు



దత్తిరాజేరులో మాట్లాడుతున్న ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, నాయకులు

గజపతినగరం: శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, ఆయన సోదరుడు, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను విమర్శించే స్థాయి స్థానిక టీడీపీ నేతల కు లేదని జెడ్పీటీసీ గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బొత్స కుటుంబంపై విమర్శలు చేసే ముందు మనస్థాయి ఏమిటో తెలుసుకోవాలన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య సూచనలు చేశారే తప్ప, విమర్శించలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే అప్పల నరసయ్యపై ఆరోపణలు, విమర్శలు చేసిన మండల టీడీపీ నాయకుడు మక్కువ శ్రీధర్ ఎన్నికల ముందు వరకు వైఎస్సార్‌సీపీలోనే ఉన్నసంగతి మరచిపోయారా అని ప్రశ్నించారు. గత అయిదేళ్లలో గజపతినగరం నియోజకవర్గంలో చేసిన అభివద్ధి మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, గజపతినగరంలో బ్రిడ్జి, బైపాస్ రోడ్డు నిర్మాణం, వంద పడకల ఆస్పత్రికి నిధుల మంజూరు వంటి ఎన్నో పనులు చేయించిన అప్పల నరసయ్యపై లేని పోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు టీడీపీ నాయకులు సిద్ధమా అని సవాల్ విసిరా రు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు, కరణం ఆదినారాయణ తదితరులు టీడీపీ నాయకుల ఆరోపణలను ఖండించారు. మధుపాడ సర్పంచ్ కడుపుట్ల పైడిపునాయుడు, నాయకులు బోని సంగమయ్య, కర్రి రాముునాయుడు, పప్పల గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నోటికొచ్చినట్లు వాగితే ఊరుకోం..

దత్తిరాజేరు: శాసన మండలిలో ప్రతి పక్షనేత బొత్స సత్యనారాయణ, ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య గురించి మాట్లాడే అర్హత మండల టీడీపీ అధ్యక్షుడు చప్ప చంద్రకు లేదని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన ఈఅయిదు నెలల కాలంలో మండలంలో నీవు చేసిన తప్పులు అన్నీ ఇన్నీ కాదని చప్ప చంద్రను ఉద్దేశించి అన్నారు. ఎంపీటీసీ మంత్రి అప్పల నాయుడు మాట్లాడుతూ బొత్స కుటుంబం గురించి తెలిసీ,తెలియక నోటికొచ్చినట్లు వాగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మహదేవ్ ఫణీంద్రుడు, మండల శ్రీను, దత్తి చిరంజీవి, చుక్క మురళి, మజ్జి అప్పలనాయుడు, రంభ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించండి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: మండలంలో నీటి సంఘం ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేలా చూడాలని వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్ విజయభాస్కర్‌ను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను చుక్కపేట, వింద్యవాసి, దత్తిరాజేరు, వంగర గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు చుక్క మురళీ, రంభ చంద్రశేఖర్(సర్పంచ్) మజ్జి అప్పలనాయుడు, దత్తి చిరంజీవి బుధవారం కలిశా రు. ఓటర్ల జాబితాపై తమ అభ్యంతరాలను తెలిపారు. అర్హత ఉన్న రైతుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తీసేసి నీటి సంఘాల్లో సభ్యత్వం లేని వారి పేర్లను టీడీపీ నాయకులు చేర్చుతున్నారని, అలాంటి వారి పేర్లను వీఆర్‌ఓలతో మాట్లాడి తొలగించాలని కోరారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు అర్హత



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్

గుర్ల: మండలంలోని చింతలపేట హైస్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ కె.లక్ష్మణ్ బుధ వారం తెలిపారు. జిల్లా కేంద్రం విజయనగరంలోని రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో కరమజ్జి మురళి, ఆర్.హేమంత్, ఆర్.కార్తీక్, బాలికల విభాగంలో ఎస్.ఉమ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా తరఫున అర్హత సాధించారని చెప్పారు. త్వరలో విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. విద్యార్థులను హెచ్ఎం గౌరీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.